*అమెరికాలోని ఓ తెలుగు యువ రచయిత రాసిన కథ

# కరెంట్ కోత



-వాడ్రేవు మల్లపురాజు

సుబ్రహ్మణ్యాన్ని ఏడుపొచ్చేంత ఉడుకుమోత్త నంగా వుంది. అప్పడప్పుడు తల కొట్టుకొని చచ్చిపోదామన్నంత కసిగా కూడా వుంది. ఉసూరు మంటూ వీధి గుమ్మం మీద చతికిలబడి కూర్చు న్నాడు చిన్న సైజు కొండలాగ. అతనికేసి భయంగా, దీనంగా మాస్తోంది అతని భార్య సీతా మహాలక్ష్మి. అతని అత్తగారు మాణిక్యాంబ మాటా పలుకు లేని అల్లుణ్ణి, మరబొమ్మలా వూగుతున్న కూతుర్ని మాస్తూ, 'రామ' 'కృష్ణ' అనుకోవడం. అలవాటు లేకపోయినా అలా అనుకొంటున్నట్టు నటిస్తూ కూర్చుంది. కొంగజపం చేస్తూ ఒక మూల. రోజూ వచ్చే నల్లకుక్కా నాలుక ఇవతల పెట్టి మూల ఒక వారగ కూర్చుంది. సాక్షి భూతం లాగ ఇవన్నీ మాస్తూ చిరుగాలికి అటు ఇటూ తల వూపుతోంది చమురుదీపం. అంతా నిశ్శబ్దంగా వుంది వాతావరణం.

అవేమి కావు కారణాలు సుబ్రహ్మణ్యం కోపాన్కి, చిరాక్కి ఉడుకుమోత్తనాన్కి. అసలు కారణం కొన్ని నెలలుగా తన గుండె కోతగా తయారయిన చీకటి దూత – కరెంట్ కోత. అసలే భారీ శరీరం, ఇరుకు చీకటిలకు అలవాలమైన చిన్న ఇల్లు, ఆఫీసులో గొడ్డు చాకిరీ, యముడు లాంటి బాస్ రోజూ వడ్డించే చీవాట్లు, ఇంటికొస్తే ఈ పాట్లు ఆరోజు జరిగిన సంఘటనలు తలచు కొంటూ ఒక్కసారి ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒక్క చావుకేక పెట్టాడు.

"బాబోయ్... వెధవ బ్రతుకు... వెధవ బ్రతు కాని... ఎరగక పెళ్ళి చేసుకొని తగలడ్డాను. ఈ ఝుంజాట మొకటి నా ప్రాణాన్కి"

బిత్తరపోయి వణికిపోయింది సీతామహాలక్ష్మి ఈ కరెంట్ కోత తన సంసారంలోనే చిచ్చు పెట్టేట్టుం దని. మాణిక్యాంబకి మతి పోయింది. కూతురుకి పెళ్ళిచేసి నా అన్న వాళ్ళు లేక, ఒంటరిగా ఆ పాత ఇంటిలో వుండలేక అంబాజీపేట నుంచి హైదరాబాద్ వచ్చి అల్లుడింటిలో పడింది తను. భర్త పోయినప్పుడు కూడా ఇంత బాధపడలేదు. ఇప్పుడు 'కరెంట్ కోత' వల్ల వచ్చే వుపద్రవం అంతకన్నా ఘోరంగా వుండేటట్టు వుంది. అల్లు డుగారు అంబోతులా అరుస్తున్నాడు. బెదురుగా మాస్తోంది సుబ్రహ్మణ్యాన్ని. ధైర్యంచేసి అడిగింది. "ఏమైంది అల్లుడు గారూ... అలా అరిచారు."

'ఊరుకినే... తోచక... తోచనప్పుడు అలా అర వడం నా అలవాటు' అన్నాడు సినిమా ఫక్కీలో కరెంట్ కోతపై వున్న కోపాన్ని, అత్తగారి మీద వున్న అసహ్యాన్ని సాధ్యమైనంత మటుక్కి అణుచు కుంటూ.

"ఉప్పు దిష్టి తియ్యనా" అందామనుకొని చెప్తే చ్చుకొని కొట్టినా కొడతాడని మళ్ళీ భయంతో ఊరుకొంది.

పాపం సుబ్రహ్మణ్యాన్ని ఆరోజు అన్నీ అవమా నాలే. మొదట ఆఫీసరు తిట్లు, అతన్ని చూసి ఆచారి వెకిలి నవ్వులు. కరెంట్ లేక ఫాన్లు తిరు గని ఆ చీకటి గుహలాంటి ఆఫీసులో బండ చాకిరీకి వళ్ళంతా చమటలు. తను బయటికొచ్చేటప్పటికి అచ్చు స్మగ్లర్స్ 'డెన్'లోంచి వచ్చినట్టు, దొంగతనం చేసి పట్టుబడి చావుదెబ్బలు తిని తప్పించుకొని పారిపోయి వచ్చినట్టున్నాడు. అలా వున్న తనని చూసి రోడ్డుమీద పోలీసు కానిస్టేబుల్ అను మానంగా చూసిన చూపు, ఇవి చాలవన్నట్టు వీధి దీపాలు లేకపోవడం వల్ల చీకటిలో వస్తూ కార్పొరే షన్ వారు, పౌరులకు స్వాగతం చెప్పడాన్కి మూత తెరచి సగౌరవంగా వుంచిన డ్రైనేజీలో గేదె దూడలా పడినతను, ఇంకా కుమిలిపోయాడు.

మాటా మంతీ లేకుండా నేరుగా మూతి దగ్గరకే పోయి బట్టలతోనే చేష్టలుడిగి చూస్తుండిపోయింది మహాలక్ష్మి.

'ఏమేవ్... తువ్వాలు తగలేయ్' అన్న అతని అరుపుకి ఇహంలోకి వచ్చి ఒక్క ఉదుటన అది తెచ్చి ఇచ్చింది. ఆ తర్వాత కాస్త అన్నం 'కెలికి'... పిచ్చి చూపులతో వచ్చి అదిగో అలా కూర్చున్నాడు గడపమీద.

"అక్కయ్య గార్కి భోజనాలు అయినట్టున్నాయి తీరిగ్గా కూర్చున్నారు" అంటూ వచ్చాడు ప్రక్కవా టాలో వుండే రామ్మూర్తి తండ్రి భావనారాయణ. ఆయనన్న, తన బాబ్డ్ హెయిర్ అత్తగారన్నా పీకలదాకా కోపం, అసహ్యం ఏర్పడిందీ మధ్య సుబ్రహ్మణ్యాన్కి. అందులోనూ ఈరోజు అగ్గిమీద గుగ్గిలంలా వున్నాడు.

చివాల్న లేచి లోపలికి పోయి తన చిన్న గదిలో తలుపులు దభాల్న వేసుకొంటూ పడుకోవడాన్కి వెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యం. సుబ్రహ్మణ్యంతో భావనారాయణ ఎప్పుడూ మాట్లాడలేదు. మాట్లా డలేదనే కంటే ఆ అవకాశం సుబ్రహ్మణ్యం అసలివ్వలేదని చెప్పాలి.

భావనారాయణ పది, పన్నెండేళ్ళ క్రితం ఏదో ఉద్యోగం వెలగబెట్టి రిటైరయ్యి, ఊళ్ళో వున్న ఆస్తి తగలేసి, కొంప కూల్చేసి కొడుకు దగ్గరకొచ్చి పడ్డాడు. సుబ్రహ్మణ్యాన్కి అదీ చిరాకు ఆయనంటే.

"అక్కయ్యగారూ... వెధవది ఈ కరెంట్ ఏమి టండీ... అస్తమానమూ ఇలా పోతుంది... అందుకే నాకు పడదండి ఈ కరెంట్లు, ఫ్యాన్లు, షోకులూ అన్నా... మన రోజులలో ఇలాగేవిటండీ పెద్ద లాంతరు వెల్గించి పెట్టామంటే మండువాంతా వెలుతురుగా వుండేది... ఆ వైభవం, ఆ వైభోగం ఇప్పుడెక్కడేడిసిందండి."


'మొదలెట్టేవ్రా వెధవ సోది... కొంపలార్పి... లాంతర్లు వెల్గించడాన్కి వచ్చేవా ముసలి నక్కా' తనలో తను తిట్టుకొంటున్నాడు ఈ ఘటాన్ని ఎలా తోలేయాలని ఆలోచిస్తున్నాడు.

'అవునండి అన్నయ్యగారూ... ఆయనకు కరెంట్ అంటే కిట్టేదికాదు. మీ బావగారూ అంటుండే వారు ఎప్పుడూ చేతిలో లాంతరు వుండాలని... పొలాలకెళ్ళే అలవాటు కదండీ అన్నయ్య గారు... కరెంట్ దీపాల్ని కూడా తీసుకువెళ్తామా ఏమిటీ అనేవారు'–

'ఇద్దరూ కల్సి నన్ను చంపుకు తింటున్నారు.' ఇక ఊరుకోలేకపోయాడు. అత్తగారు అంబాజీపేట నుంచి తెచ్చిన 'సున్నుండ' డబ్బాలోంచి తీసి గది చిన్న కిటికీలోంచి భావనారాయణ బట్టబుర్రకు తగిలేలా గట్టిగా కొట్టాడు.

'బాబోయ్... అక్కయ్యగారు' అరిచాడు భావ నారాయణ.

"ఏమైంది అన్నయ్యగారు. గుండె నొప్పా మళ్ళీన"




ఆత్రుతగా అడుగుతోంది మాణిక్యాంబ. సీతామహాలక్ష్మి కంగారు పడుతూ వచ్చింది.

"దరిద్రపుకొంప... చీకటి, దెయ్యాల అరుపులు తప్పా ఏ సుఖంలేదు ఈ పాడు కొంపలో" విసుక్కుంది సీతామహాలక్ష్మి.

'అది కాదండీ అక్కయ్యగారు ఎవడో బంతి వుచ్చుకొని కొట్టినట్టయింది.'

చీకట్లో బంతి ఆట ఏవిటండీ అన్నయ్యగారూ... విడ్డూరం... ఏ 'గాలన్నా' నేమోనండీ... నాకూ ఇందాకట్నించి భయంగా వుంది... పోయి ఆంజనేయ దండకం చదివి పడుకోండి...

'అలాగే అక్కయ్యగారూ' అంటూ బెదురుతూ, భయంగా ప్రక్క వాటాలోకి పోయాడు భావనారాయణ. హమ్మయ్య అనుకున్నాడు మణ్యాం. తన కసి, వుక్రోషం ఈ చర్యతో తీరడంతో మనస్సు తేలికపడి ఆనందంలో నిద్రకుపక్రమించాడు.

* * *

మర్నాడు రాత్రి మళ్ళీ మామూలే. ఆశా కిరణంలా బల్బ్ ఒకసారి వెల్గి ఆరిపోయింది. సుబ్రహ్మణ్యాన్కి వళ్ళు మండింది. తన కొలీగ్ ఆచారి కిసుక్కు నవ్వి... ఫైల్లో తలదూర్చినట్టు అన్పించింది. వెక్కిరిస్తున్నట్టు బల్బ్ అలా వెలిగి ఆరిపోవడం.

ఇంటికి వున్న మూడు బల్బ్‌లు తీసి పడేశాడు. ఛ భారతదేశంలో... ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో... ఛస్తే మళ్ళీ పుట్టకూడదు అనుకున్నాడు మనస్సులో. పైకి అంటే దేశద్రోహి, టెర్రరిస్టు అంటారని భయం వేసి.

పోయిన వేసవి కాలమంతా కరంట్ కోతతో చచ్చారంతా ఆ ఇంట్లో. ఆరోజు సంగతింకా జ్ఞాపకం వుంది తనకు. అది తన పెళ్ళిరోజు... ఎన్నో ఆశలలో, ఆనందంతో పెళ్ళివారు తరలి వెళ్ళారు అంబాజీపేటకు. రాత్రి ముహూర్తం పెళ్ళికి.

అత్తగారి ఆదరణకు ఎంతో మురిసిపోయాడ తను. ఆ ఇల్లు, ఒక అర ఎకరం విస్తీర్ణంలో వుండే పెరడు, అందులో కావుకాపే కొబ్బరి చెట్లు... ఓహో... ఏమి నా భాగ్యం అనుకున్నాడు.

"అదేం భాగ్యం బాబూ.... ఏదో నాకున్నదంతా ఇంక అమ్మాయిదేకదా! అమ్మాయి ఆస్తి, నీ ఆస్తి వేరేనా? ఇదంతా ఇకనుంచి నీదే బాబూ" అంది అత్తగారు... ఆ దొడ్డి చూపిస్తూ... ఆనందంతో మెలికలు తిర్గిపోయాడతను.

ఆ ఆనందం అట్టేకాలం నిలబడలేదు. తను తాళికట్టే టైంకి కరెంట్ పోయింది. ఆ కంగారు, పురోహితులు పెట్టే తొందరవల్లా ప్రక్కనే వున్న అత్తగారి మెడలో కట్టెయ్యబోయాడు. "పెళ్ళి కూతుర్ని నేనిక్కడున్నానని అరచింది సీతామహాలక్ష్మి. రాబోయే ఉపద్రవాన్ని గ్రహించి. ఆమె సమయస్ఫూర్తిని అందరూ మెచ్చుకున్నారు. ఎవరో మహానుభావుడు వెల్గించిన అగ్గిపుల్ల కాంతిలో ముహూర్తం టైంలో తాళి కట్టాడు మణ్యాం. అయినా అతని మనస్సులో ఉత్సాహం లేదు. తనకు చీకటి మొదటి భార్య, సీతమ్మ రెండవ భార్య అనుకున్నాడు చాలా సార్లు ఆ తర్వాత, అప్పుడప్పుడు అతని బాధ. నువ్వు అడుగు పెట్టిన తర్వాతే నా ఇంట్లో దీపం ఆరిపోయిందంటూ భార్యను సాధిస్తూ వుంటాడు.

పెళ్ళి జర్గిన మర్నాటి వుదయం... పెళ్ళికి వచ్చిన బంధువులంతా తనకు శాపనార్థాలు పెట్టారు. 'సుబ్బిగాడి పెళ్ళికి ఎరక్కపోయి వచ్చాం... దరిద్రం... రాత్రి నా పెట్టెలో దుప్పటీ పోయింది' అని ఒకావిడ. 'నా చెప్పులు కనబడి చావడంలేదు' అని ఒక ముసలాయన.

'అమ్మ... నా లాగు... ఎర్రలాగు కన్పించడంలేదు' అని ఒక కుర్రాడు, "వీళ్ళ బుద్ధులు పాడుగాను... దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళ వాన ఎదురైనట్టు... నా ముక్కుపొడుం డబ్బా కూడా పట్టుకుపోయారు త్రాష్టులు" అని తన వూరు నుంచి తీసుకువచ్చిన వృద్ధ పురోహితుడూ... ఒకరేమిటి అంతా తనను, తన "దరిద్రపు" పెళ్ళిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి వెళ్ళారు.

ఈ కరెంట్ పోయిన అవకాశం చూసుకుని ఒకళ్ళవొకళ్ళు కాజేసారన్న సంగతి శీనుగాడి ద్వారా తనకు తెలిసినా... అందరి పెట్టెలు తనిఖీలు చేస్కోండనడాన్కి కూడా తనకు నోరు రాలేదు. బలిపశువులా ఆ నిష్ఠురాలు వింటూ కూర్చుండిపోయాడతను.

ఆ తర్వాత కన్నీళ్ళతో కూతుర్ని తనతో సాగనంపుతున్న అత్తగారితో అన్నాడు. 'మీరొక్కరూ ఏం చేస్తారిక్కడ మాతోనే వచ్చెయ్యకూడదండి అత్తయ్యగారూ.' అలా అనడం వెనుక ఆదాయం తెచ్చే చెట్లు, ఆ ఇల్లు, తనకు ముట్టిన 'కట్నం'ల యొక్క పాత్ర బలీయంగా వుందని చెప్పనక్కర్లేదు.

'వస్తాను బాబూ... ఇవన్నీ చక్కబెట్టుకుని' అని రానే వచ్చింది.

ఇంటి పనులలో, భోజనాలయినాక కంచాలు, పాత్రలు కడగడంలో సహాయపడుతోంది మాణిక్యాంబ కూతురికి. మహానగరమైనా నుయ్యి వుంది గనుక సరిపోయింది గాని, ఈ కరెంట్ బాధతో పాటు ఆ నీళ్ళ బాధ కూడా తప్పేది కాదు.

నూతి చప్టాలో వంగుని గిన్నెలు కడుగుతోంది మాణిక్యాంబ. ఆఫీసులో సత్కారం, చీకటిలో ఛీత్కారం వల్ల వళ్ళు మంటగా వుంది, గిన్నెల చప్పుడొకటి. నల్లకుక్క పనే ఇది అని, ఆ చిరుకాంతిలో ఆకారాన్ని కర్ర తీసుకుని నడ్డిమీద గట్టిగా ఒకటి వేసాడు. "బాబోయ్ చచ్చిపోయాన్రాయనో" అని అరవై మైళ్ళు విన్పించేలా అరచింది మాణిక్యాంబ. తప్పు తెలుసుకుని కొయ్యబారిపోయాడు మణ్యాం. మహాలక్ష్మి పరిగెట్టుకొంటూ వచ్చింది గుండెల్ని అరచేతుల్లో పట్టుకొని. భావనారాయణ 'గాలి' 'గాలి' అంటూ వచ్చాడు. అంతా పోగుబడ్డారు.

ఇక అల్లుడుగారి వరుస బావుండలేదని, ఒక రోజు ఉదయం తన వూరికి ప్రయాణం అయ్యింది మాణిక్యాంబ. మణ్యాం మనస్సులో చాలా ఆనందించాడు. ఆ ఆనందం కూడా అట్టే కాలం వుండలేదు.

షాక్ తిన్నట్టు కొయ్యబారిపోయిన మణ్యాన్ని, అతని చేతిలో వున్న చిన్న కాగితాన్ని చూస్తూ సీతామహాలక్ష్మి గుండెలదిరిపోయాయి.

'అయ్య బాబోయ్ మా అమ్మ కేమైంది' అంది టెలిగ్రాం లాంటి ఆ కాగితం వంక చూస్తూ...

అది ఆ నెల 315 రూపాయలు కట్టమని వచ్చిన కరెంట్ బిల్లు. నెలంతా కరెంట్ కోత వున్నా అంత బిల్లు వచ్చినందుకు షాక్‌తినడం మహాలక్ష్మి వంతయిందిప్పుడు.